www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 6 నవంబర్ 2024

5

తూర్పుగోదావరి

## నేడు గోపాలపురంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - గోపాలపురం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయ అధికారి హరిశ్చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.పెరుమాళ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2 కంపెనీలు హాజరు కానున్నాయన్నారు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, విద్యార్హతలు గల 19 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఆశక్తి గల అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. https://forms.gle/vp5p7fEYor8J7wqGలో పూర్తి వివరాలతో రిజిస్టర్ కావాలన్నారు. జాబ్‌మేళాకు రెజ్యూమ్‌తో పాటూ ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు 8499943366, 7396740041 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# అవస్థల అపార్

- నూతన విద్యా విధానంతో మరో కొత్త చిక్కు
- ఆధార్‌లో వివరాల మార్పుకోసం తల్లిదండ్రుల అవస్థలు
- జనన ధ్రువీకరణ పత్రాలు కావాలంటున్న నిర్వహకులు
- విద్యాశాఖపై తీవ్ర ఒత్తిడి తెస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

నూతన విద్యా విధానంలో భాగంగా కేంద్రం తలపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ప్రక్రియ విద్యావ్యవస్థలో కొత్త చిక్కులను తెచ్చిపెడుతోంది. వన్ నేషన్- వన్ ఐడి కార్డు అంటూ కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి తెరతీసింది. అయితే క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిగణలోకి తీసుకోకుండా విద్యాశాఖపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావడంతో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు, ఉపాధ్యాయులకు తలపోటుగా మారింది. జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి ఒక నెంబర్ కేటాయించి మార్కులు, గ్రేడ్లు ఉపకార వేతనాల వివరాలు, క్రీడలు ఇతర అంశాల్లో సాధించిన వివరాలను నిక్షిప్తం చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఈ నమోదుకి పాఠశాలలో ఉన్న వివరాల ఆధారంగా కాకుండా ఆధార్‌లో నమోదైన వివరాల ఆధారంగా జనరేట్ అవుతుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తప్పనిసరిగా పాఠశాలలో ఉన్న పేరు, పుట్టిన తేదీ వివరాలు ఆధార్‌లో నమోదు చేయించుకోవాలని పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.

ఆధార్ కేంద్రం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

జిల్లా వ్యాప్తంగా 2,54,587 మంది విద్యార్థులు ఉండగా మంగళవారం నాటికి 54 శాతం నమోదు పూర్తయింది. 1,36,365 మంది విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. విద్యాశాఖ అధికారులు ఒత్తిడి తేవటంతో ఆధార్‌లో తప్పులను సవరించుకోవటానికి విద్యార్థులు, తల్లిదండ్రులు జనన ధ్రువీకరణ పత్రాలకోసం అగచాట్లు పడుతున్నారు. గతంలో మంజూరు చేసిన జనన ధ్రువీకరణ పత్రాలున్నా అందులో తప్పుల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గతంలో ఆఫ్‌లైన్ విధానంలో జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు. కాల క్రమంలో వీటిని ఆన్‌లైన్ చేసేప్పుడు తప్పుల తడకగా నమోదయ్యాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ విభాగ సిబ్బంది చేసిన తప్పులకు సైతం తల్లిదండ్రులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

అక్టోబర్ నెలాఖరు నాటికే అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంకటనే పూర్తి చేయాలంటూ ఎంఇఒలు హెచ్ఎంలపై ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి చేసింది. అయినా ఇప్పటికీ 60 శాతం మించలేదు. ఒత్తిడి తాళలేక ఎంఇఒలు, హెచ్ఎంలు పాఠశాల రికార్డులకు పాతర వేస్తున్నారు. విద్యార్థుల వివరాలు స్కూలు రికార్డులు, యుడైస్ అపార్ మాడిఫ్యూల్లోనూ ఒకే విధంగా ఉండాలి. గతలో ఆధార్ కార్డు నమోదు చేసిన సమయంలో తప్పుల తడకగా చేయడం వల్ల చాలా మంది విద్యార్థుల పేర్లు, ఇంటిపేర్లు, పుట్టిన తేదీ వివరాలు పాఠశాలలోని రికార్డులతో సరిపోలడంలేదు. యుడైస్ ఎడిట్ ఆప్షన్ ఎంఇఒలు, హెచ్ఎంలకు ఉంటుంది. ఈ క్రమంలో ఆధార్ కార్డుల్లో ఉన్న వివరాల ప్రకారం యుడైస్‌లో ఎడిట్ చేసేసి మమ అనిపిస్తున్నారు. భవిష్యత్తులో పాఠశాల రికార్డులు, హడావుడిగా సృష్టిస్తున్న అపార్ కార్డుల పొంతన లేకపోతే విద్యార్థులు నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి జనన ధ్రువీకరణ పత్రాల్లో సవరణ, నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

### జిల్లాలో 54 శాతం నమోదు పూర్తి

నూతన విద్యా విధానంలో భాగంగా ప్రభుత్వం అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ప్రక్రియ అందుబాటులో తెచ్చింది. జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి ఒక నంబర్ కేటాయించి మార్కులు, గ్రేడ్లు ఉపకార వేతనాల వివరాలు, క్రీడలు ఇతర అంశాల్లో సాధించిన వివరాలను నిక్షిప్తం చేయనున్నాము. జిల్లాలో ఇప్పటి వరకు 54 శాతం నమోదు ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే నూరుశాతం పూర్తి చేస్తాం.

- జి. వాసుదేవరావు, జిల్లా విద్యాశాఖ అధికారి

### ఆధార్‌లో సవరణలు త్వరగా చేయాలి

విద్యార్థుల ఆధార్‌లో వివరాల మార్పులకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. మున్సిపాలిటీలు, పంచాయతీలు, కార్పొరేషన్‌లలో జనన ధ్రువీకరణ పత్రాల విభాగ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలి. అదే విధంగా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి. ప్రతి పాఠశాలలోనూ ఆధార్ అప్‌డేట్ కోసం మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

- జి. రాఘవరావు సీతంపేట, రాజమహేంద్రవరం, విద్యార్థి తండ్రి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

## జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఉపాధ్యాయ ఎంఎల్‌సి నోటిఫికేషన్ రావడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎస్‌పి డి.నరసింహకిషోర్, జెసి ఎస్.చిన్నరాముడు, డిఆర్‌ఒ టి.శ్రీరామచంద్రమూర్తిలతో కలిసి ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉమ్మడి ఉభయ గోదావరీ జిల్లా పరిధిలోని టీచర్స్ ఎంఎల్‌సి స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూలు విడుదల చేసిందన్నారు కాకినాడ జిల్లా కలెక్టర్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి సహాయ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా పరిధిలో 20 పోలింగు కేంద్రాల్లో ఉపాధ్యాయ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 18 మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో రెండు పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 2,893 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. ఈ నెల 11న నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. నవంబర్ 18 నామినేషన్లకు తుది గడువు అని, 19న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణలకు చివరితేదీగా నిర్ణయించారని తెలిపారు. డిసెంబర్ 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. డిసెంబర్ 9న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. డిసెంబర్ 12తో ఎన్నికల కోడ్ ముగుస్తుందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎటువంటి అధికారిక కార్యక్రమాలను నిర్వహించరాదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను యథావిధిగా కొనసాగిస్తామన్నారు.

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం : దుర్గేష్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన నలుగురు కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలబడుతుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. మండలంలోని తాడిపర్రులో మృతుల కుటుంబాలను మంగళవారం ఆయన పరామర్శించారు. ఎంఎల్‌ఎ ఎన్నికల కోడ్ ప్రారంభమైన తరుణంలో ఎటువంటి హామీలు ప్రకటించ లేకపోతున్నప్పటికీ తప్పనిసరిగా మృతుల కుటుంబ సభ్యులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. తొలుత కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు ప్రకటించిన ఎక్స్ గ్రేషియా సొమ్ము రూ.5 లక్షలను అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోమటి అనంతరావుకు వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారని త్వరలో డిశ్చార్జ్ అయ్యే పరిస్థితిలో అతను ఉన్నాడని కుటుంబ సభ్యులకు చెప్పారు. ఘటనకు దారి తీసిన ఫ్లెక్సీ ప్రదేశాన్ని మంత్రి పరిశీలించారు.

## మూడు ఇసుక లారీలు సీజ్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం సాండ్ పాయింట్ వద్ద ఎటువంటి బిల్లుల లేని 3 ఇసుక లారీలను గుర్తించి సీజ్ చేశామని ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్ తెలిపారు. మంగళవారం ధవళేశ్వరంలోని ఇసుక రీచ్‌లను ఆయన తనిఖీ చేశారు. ఇసుక లోడ్‌తో ఉన్న మూడు లారీలను గుర్తించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. లారీ యజమానులపై విచారణ చేసి సీజ్ చేయాలని రాజమహేంద్రవరం సౌత్ జోడ్ డిఎస్‌పిని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పాలసీ విధానంలో మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఉచితంగా తీసుకొని వెళ్లొచ్చని, అయితే గ్రామ అధికారి ద్వారా పొందిన ధ్రువపత్రాలు తప్పనిసరి అన్నారు.

లారీలను సీజ్ చేస్తున్న ఆర్‌డిఒ కృష్ణనాయక్

## 'ఉల్లాస్'పై శిక్షణ

ప్రజాశక్తి - పెరవలి

ఉల్లాస్‌పై మంగళవారం మండల సమైక్య కార్యాలయంలో జిల్లా వయోజన విద్య ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ ఎపిఎం బండారు రామకృష్ణ మాట్లాడారు. మండలంలో 800 మంది అభ్యాసకులను గుర్తించామన్నారు. 80 మంది వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వయోజన విద్యపై ఎపిఒ గుత్తుల విజయభాస్కర్ శిక్షణ ఇచ్చారు. ఐసిడిఎస్ సిడిపిఒ మధిరపల్లి శ్రీలక్ష్మి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ కేంద్రాల సహకారం కూడా ఉంటుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సిసి కర్రి కనకదుర్గ, అకౌంటెంట్ టి.మహాలక్ష్మి, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి ఓటు నమోదుకు నేటితో గడువు పూర్తి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఎంఎల్‌సి ఓటరు నమోదుకు బుధవారంతో గడువు ముగియనుందని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. గత ఎన్నికలలో నమోదు చేసుకున్న మండలంలోని డిగ్రీ పట్టాదారులు సుమారు 2,600 మంది ఉండగా, మంగళవారం నాటికి ఆన్ లైన్, ఆఫ్ లైన్‌ల ద్వారా 1,832 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈనెల 23 నుంచి డిసెంబర్ 9 వరకు దరఖాస్తుల్లో ఏవిని ఆక్షేపణలున్నా, కొత్త క్లెయిమ్‌లు కూడా చేసుకో వచ్చున్నారు. డిసెంబర్ 30 నాటికి తుది ఓటర్ లిస్ట్ తయారవుతుందన్నారు. నిబంధనలలో ప్రకటించిన తేదీ నాటికి డైరెక్ట్ డిగ్రీ పూర్తి చేసిన వారు కూడా అర్హత కలిగి ఉంటారన్నారు. పదో తరగతి, ఇంటర్ చదివి మూడేళ్ల డిగ్రీ చేసిన వారు మాత్రమే అర్హులన్నారు. అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు.

## దోషులను శిక్షించాలని కొవ్వొత్తులతో ర్యాలీ

ప్రజాశక్తి - కడియం

కడియం మండలం బుర్రిలంక గ్రామంలో వివాహితపై అత్యాచారం, హత్య ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలంటూ ఐద్వా, శ్రామిక మహిళ, సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కడియంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కడియం సెంటర్‌లో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, దోషులను కఠినంగా శిక్షించాలని, నర్సరీల్లో మహిళా కార్మికులకు భద్రత కల్పించాలని నినదించారు. ఈ సంధ్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి మాట్లాడారు. కసూరి అనే మహిళపై అత్యాచారం, హత్య హేయమైన చర్య అన్నారు. మహిళలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు రోజురోజుకూ పెరగడం ఆందోళనకరమైన విషయం అన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నిందితులను అరెస్టు చేసి వెంటనే కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మృతురాలు కస్తూరి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం తరుపున రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలన్నారు. నర్సరీ యజమాని కూడా బాధిత కుటుంబానికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో అంగవైకల్యంతో ఉన్న కుమార్తెకు పూర్తి భరోసా కల్పించాలన్నారు. ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా కఠన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళలు, ప్రజాసంఘాలు, సిఐటియు నాయకులు, నర్సరీ మహిళలు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న మహిళలు

కడియంలో మానవహారం

ధవళేశ్వరం పిహెచ్‌సి వద్ద నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

## ఒప్పందాల జిఒలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ఆశావర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు, నాయకుతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జిఒలును తక్షణం విడుదల చేయాలని ఆశావర్కర్లు రాజమహేంద్రవరం రూరల్ పిహెచ్‌సి వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఒప్పద జిఒలు, సర్క్యులర్లు విడుదల చేయాలని నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒప్పందాలు జరిగి 9 నెలలైనా నేటికీ జిఒలు విడుదల చేయలేదన్నారు. ఈ మధ్య కాలంలో అనేకమంది ఆశావర్కర్లను రిటైర్మెంట్ చేశారన్నారు. 60 నుంచి 62 ఏళ్ల కు పెంపుదల జిఒ రాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామన్నారు. వారికి రిటైర్మెంట్ బెనిఫిట్లు కూడా అందించలేదన్నారు. పలువురు ఇటీవల మరణించారని, వారికి బీమా సౌకర్యం కూడా వర్తించలేదన్నారు. నాసిరకపు మొబైళ్లతో నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పర్మిషన్, సెలవు కోసం అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. సెలువు కావాలంటే ప్రత్యామ్నాయంగా మరో ఆశావర్కర్ పేరు సూచించి ఆమెతో ఆ వర్క్ చేయిస్తేనే సెలవు లేదా పర్మిషన్ ఇస్తున్నారన్నారు. ఈ మేరకు అధికారులు రాతపూర్వకంగా లెటర్లు తీసుకుంటున్నారన్నారు. కొత్త రికార్డులు ఏప్రిల్ 1 నుంచి నిర్వహించాల్సి ఉండగా నేటికీ వాటిని అందించలేదన్నారు. ఒప్పంద జిఒలు విడుదల చేయకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఇప్పటికైనా జిఒలను విడుదల చేయాలని లేకుంటే నవంబర్ 18న కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందించారు.

## నేడు ఆర్ట్స్ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమండ్రిలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర తెలిపారు. ఏదేని డిగ్రీ అర్హత కలిగి ఉన్నా, 2023లో డిగ్రీ పాసైనా, 2024లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. పది కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు బుధవారం ఉదయం 10 గంటలకు కళాశాల సెమినార్ హాల్లో విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావొచ్చని జెకెసి కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్ రెడ్డి తెలిపారు. ఇతర వివరాలకు కళాశాల జెకెసి విభాగంలో సంప్రదించాలన్నారు.

## కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

లాలాచెరువులోని స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగ్గం, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి కనీసం పదో తరగతి లేదా చదవగలిగే వారికి అవకాశం ఉంటుందన్నారు. నవంబర్ 18 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. 45 రోజులపాటు జరిగే ఈ ఉచిత శిక్షణలో మెటీరియల్ అలాగే మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. శిక్షణ అనంతరం ఉత్తీర్ణత పత్రాలను అందిస్తామని రాంబాబు తెలిపారు. టైలరింగ్, మగ్గం కోర్సుల కోసం ఫోన్ 9490710850, 98498 47489 నెంబర్లలో సంప్రదించాలని, లేదా స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి రావాలని కోరారు.

## డిమాండ్లు నెరవేర్చాలని 104 సిబ్బంది వినతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, గోపాలపురం

తమ డిమాండ్లను నెరవేర్చాలని, సమస్యలను పరిష్కరించాలంటూ 104 సిబ్బంది మంగళవారం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వి.ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు 3 నెలలుగా వేతనాలు నిలిపేశారన్నారు. జీతాలు లేక కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలన్నారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించాలన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒలకు జిఒ7 ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని, డిఎస్‌సి ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్‌లను కాంట్రాక్టులో పెట్టాలన్నారు. ఉద్యోగులకు బీమా సదుపాయం కల్పించాలని, యాజమాన్యం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరం 104 ఉద్యోగులు పాల్గొన్నారు. గోపాలపురంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.నవీన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది డేటా ఎంట్రీ ఆపరేటర్ కిషోర్, డ్రైవర్ నాగ బాబు పాల్గొన్నారు.

### కార్టూ'నిజం'




సిసి కెమెరాలతో నేరాల నియంత్రణ

## ఇసుక తవ్వకాల్లో నిబంధనలకు తూట్లు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో సీతానగరం, ముగ్గళ్ల ర్యాంపుల్లో నిబంధనలకు తూట్లు పొడుస్తూ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా వందల సంఖ్యలో అవసరానికి మించి ట్రాక్టర్లతో ఇసుక ఎగుమతి చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతంలో జలవనరులు, ఖనిజ, భూగర్భ శాఖలు సమన్వయంతో జియో కోర్డ్ నేట్ చేసి హద్దులు నిర్ణయించాలి. హద్దులు నిర్ణయించిన తరువాత మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు ఇసుక తవ్వకాలు వివరాలు, లబ్దిదారుల వివరాలు, ట్రాక్టర్ల సిబుక్, డ్రైవర్ లైసెన్సు నమోదు చేసుకుని ర్యాంపు నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లడానికి అనుమతి ఇస్తారు. మరోవైపు దళితులకు చెందిన ఫీల్డ్ లేబర్ సొసైటీ భూముల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఇసుక ఉచితమైనప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు వ్యతిరేకంగా సీతానగరం కైలాసగిరి, ముగ్గళ్ళ ర్యాంపుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. సిండికేట్‌గా ఏర్పడి బాట చార్జీలు, ట్రాక్టర్‌కి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. రాజంపేట, కాటవరం గ్రామాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్లుకు ఇసుక తరలిస్తుండగా, ర్యాంపు నుంచి ఐదు కిలోమీటర్ల పరిధిలో ఇసుక తరలించాలని షరతులు ఉన్నప్పటికీ రాత్రీ పగలూ తేడా లేకుండా గోకవరం, జగ్గంపేట, కోరుకొండ మండలాలకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. సంబంధిత జిల్లా ఇసుక పర్యావేక్షణ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

ముగ్గళ్ల ర్యాంపు నుంచి తరలిపోతున్న ఇసుక

## టెన్త్ బయాలజీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా బయాలజీ ఫోరమ్ పదవ తరగతి విద్యార్థుల కోసం తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఎంఇఒ కుశలవదొర, ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు రమణ రావు, గణపతి, తూర్పుగోదావరి జిల్లా బయాలజీ ఫోరమ్ అధ్యక్షులు శ్రీనివాస నెహ్రూ, ప్రధాన కార్యదర్శి సుధారాణి, ఉపాధ్యాయులు వీరబాబు, లక్ష్మి పాల్గొన్నారు.

ఆవిష్కరిస్తున్న డిఎస్ఇఒ వాసుదేవరావు

సాయం అందిస్తున్న నర్సరీ అసోసియేషన్ నాయకులు

## కస్తూరి కుటుంబానికి నర్సరీ అసోసియేషన్ సాయం

ప్రజాశక్తి - కడియం

కడియం మండలం బుర్రిలంకలో ఇటీవల అత్యాచారం, హత్యకు గురైన బాధిత కుటుంబానికి నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోల రాజు ఆధ్వర్యంలో కార్యవర్గ వర్గ సభ్యులు రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మల్లు పోలరాజు మాట్లాడుతూ పచ్చని నర్సరీల్లో ఇలాంటి సంఘటన జరగడం చాలా భాధాకరమన్నారు. నేరస్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకుని, పూర్తి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గాద నాగేశ్వరరావు, కన్వీనర్ అడ్డగర్ల రమేష్, డైరెక్టర్లు గాజుల రత్తయ్య, పిల్లా శీనివాస్, కో-అప్షనల్ మెంబర్ వడ్లమూరి రాజేష్ రత్నం కష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గుర్రప్పాలెం గ్రామ శివారున మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..జగ్గంపేటకు చెందిన సత్తారావు సతీష్, గోళ్ళ నాని మండలంలోని భవిరం గ్రామం నుంచి బైక్‌పై జగ్గంపేట వస్తుండగా, మొర్ల సతీష్, మొర్ల అభిరామ్, వేమగిరి యాకోబు జగ్గంపేట నుంచి గొల్లలగుంట బైక్‌పై వెళుతూ ఎదురుఎదురుగా ఢీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అవతల నుంచి వస్తున్నామనే సమాధానం తప్పితే అంబులెన్స్ మాత్రం రాలేదు. దీంతో స్థానికులు క్షతగాత్రులను స్థానిక సిహెచ్‌సికి ఆటోలో తరలించారు. సిహెచ్‌సిలో ఒకరే వైద్యులు ఉండటంతో సరియైన వైద్యం అందలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆఖరికి ప్రయివేట్ అంబులెన్స్‌ను పిలిపించుకుని కుటుంబ సభ్యులు కాకినాడ ఆసుపత్రికి తరలించారు.

### మిస్సింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కొత్తపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన అబ్బిశెట్టి జయలక్ష్మి(53) మానసిక సమస్యతో బాధపడుతోంది. గతేడాది జనవరిలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలిస్తూనే ఉన్నారు. ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో మంగళశారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు

### పేకాడుతున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

పేకాటి శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు. రఘుదేవపురం గ్రామంలో చెరువు వద్ద ఉన్న పొగాకు బేరన్‌లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి పేకలు, రూ.6,280 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

### ఇసుక లారీ స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీను సోమవారం అర్ధరాత్రి సీతానగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సాధారణ తనిఖీల్లో భాగంగా సీతానగరం ఎస్ఐ పెట్రోలింగ్ చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీను గుర్తించారు. వాహనాన్ని అదుపులోకి తీసుకుని, జిల్లా భూగర్భ శాఖ అధికారులకు బదిలీ చేశారు. ప్రస్తుతం సీతానగరం పోలీసుల ఆధీనంలో ఇసుక లారీని ఉంచారు.

మందులపై ఆరా తీస్తున్న ఎంఎల్ఎ అశోక్

### ఆసుపత్రిలో ఎంఎల్ఎ తనిఖీలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామితో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది అందిస్తున్న సేవలపై ఎంఎల్ఎ అసంతృప్తిని వ్యక్తం చేశారు. పేద ప్రజలకు ఉచితంగా మందులు అందించడం మానేసి ప్రయివేట్ దుకాణాల్లో తీసుకోమని చెప్పడంపై ఆయన మండిపడ్డారు. కాలం చెల్లిన మందులు ఇస్తున్నారని రోగుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని ఆసుపత్రి డిడి టి.రవిశంకర్, ఎడి పలాస్‌కుమార్ సన్యాల్‌ను నిలదీశారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. డాక్టర్లు, అంబులెన్స్ డ్రైవర్లు సమయపాలన పాటించడం లేదన్నారు. గర్భిణీ స్త్రీలను కాకినాడ రిఫర్ చేయాలనుకుంటే ముదస్తుగా వారికి తెలియ చేయాలని, అప్పటికప్పుడు చెప్పి తరలిస్తే మధ్యలో ఏమైనా జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆసుపత్రిలో నూతన డిజిటల్ ఎక్సరే మిషన్ కొరకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని తెలిపారు. ఐసీయు విభాగాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి గత కొన్నేళ్ళు గాజీతాలు ఇవ్వడం లేదని వాటి వివరాలను తనకు సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడారు.

## నైపుణ్య గణనపై శిక్షణ

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నైపుణ్య గణనపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, నాన్ టెక్నికల్ ఆఫీసర్ సి.హెచ్.వర్ధసాది అధ్యక్షతన శిక్షణ నిర్వహించారు. సచివాలయం సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి లొకేషన్ ఆధారంగా యూజీని గుర్తించి ఆధార్ ఒటిపితో సర్వే చేయాలన్నారు. వారి క్వాలిఫికేషన్ వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**గోకవరం :** గోకవరం మహిళ సమాఖ్య భవనంలో మంగళవారం స్కిల్ డెవలప్‌మెంట్ సెన్సెస్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ ఎం.గోవిందు హాజరై మాట్లాడారు. 15 నుంచి 59 ఏళ్లలోపు వారి వివరాలను సేకరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ట్రైనింగ్ ఇచ్చి వారి ఉపాధి కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈనెల 15 నుంచి సచివాలయం సిబ్బంది ప్రతి గ్రామంలో ప్రతి ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ పి.ఎస్.అప్పలరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**దేవరపల్లి :** మంగళవారం దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ అధ్యక్షులు కెవికె.దుర్గారావు అధ్యక్షతన మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి నైపుణ్య గణనపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కిల్ సెన్సెస్ కార్యక్రమం విధి విధానాలు వివరించారు. దాని ప్రాధాన్యతను తెలిపారు. అర్హత గల యువతకు ఉపాధి కల్పనకు అవసరమైన తోడ్పాటును అందించేందుకు ప్రభుత్వం ఈ గణన చేపడుతుందన్నారు. దీన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాజారావు, తహశీల్దార్ రాజ్యలక్ష్మి, పంచాయతీల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గోకవరంలో శిక్షణ ఇస్తున్న ఎంపిడిఒ గోవిందు

**గోపాలపురం :** పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి స్కిల్ సెన్సెస్ సర్వే కార్యక్రమంపై ఎంపిడిఒ బివిఎస్.శ్రీనివాస్, తహశీల్దార్ విద్యాపతి మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్వే చేయాల్సిన విధానం, సేకరించాల్సిన వివరాలు, యాప్‌లో అప్‌లోడ్ చేయడం వంటి వాటిపై అవగాహన కల్పించారు.

## ఉపాధి పనులకు సర్పంచ్ వ్యతిరేకం కాదు

ప్రజాశక్తి-నల్లజర్ల

ఉపాధి పనులకు సర్పంచ్ సౌజన్య వ్యతిరేకం కాదని వైసిపి నాయకులు స్పష్టం చేశారు. ఉపాధి హామీ పనులు అడ్డుకుంటున్నారంటూ సర్పంచ్ జాలపర్తి సౌజన్యపై మంగళవారం పలు పత్రికల్లో వచ్చిన వార్తలపై వైసిపి నాయకులు స్పందించారు. 2024- 25 సంవత్సరానికిగాను గుర్తించిన ఉపాధి పనులను మానేసి, నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టిడిపి నాయకులు పాత పనులను వదిలేసి కొత్త పనులు చేయించడం కోసం సర్పంచ్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. తమ పార్టీపై బురదజల్లే విధంగా ప్రజలలో తప్పుడు సందేశాన్ని తీసుకువెళ్తున్నారని మాజీ సర్పంచ్ బొప్పన సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి శ్రేణులు వారి సొంత పొలాల్లో పనులు చేయించుకునేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాము పంచాయతీ నుంచి కూడా బిల్లులు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. గ్రామంలో జరిగే ఉపాధి హామీ పనులకు అడ్డుపడిన దాఖలాలు లేవని జలపర్తి వెంకట రత్నం, ఎంపిటిసి కాకర్ల రాజారావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొప్పన రాజేంద్రప్రసాద్, కానుమిల్లి తారక రామకృష్ణ, అంచులూరి వెంకటేశ్వరరావు, కరారి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన కార్యాలయం వద్ద ఓటరు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం జనసేన పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటరు నమోదును నిర్వహించారు. రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని నాయకులు తెలిపారు. రామచంద్రపురంలో టిడిపి నాయకులు గద్దే సురేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను ఓట్లు నమోదు చేస్తున్నారు. ఇంకా ఎవరైనా అర్హత గలవారు ఉంటే బుధవారం సాయంత్రం ఆరు గంటల లోపు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## దేవాలయం అభివృద్ధికి మంత్రి సహకారం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు అగ్రహారం గ్రామంలో వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధికి మంత్రి దుర్గేష్,మాజీ ఎంఎల్‌సి బూరుగుపల్లి శేషారావు, ఎంపిపి కె.సీతారాంప్రసాద్ సహకారంతో మండల పరిషత్ నిధులు రూ.15లక్షలతో పనులను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రాంగణంలో దాతలు హరిదాసు వీర్రాజు కుమారులు రూ.50వేలతో పుట్టను ఏర్పాటు చేశారు. మంగళవారం నాగుల చవితి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

## ఓటరు నమోదుపై ఎంఎల్ఎ అసంతృప్తి

ప్రజాశక్తి - తాళ్లపూడి

పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటర్ల నమోదుపై కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పాటు తాళ్లపూడి మండలంలోని సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఓట్ల నమోదు శాతం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటు నమోదుకు ఇంకా ఒక్కరోజు గడువు మాత్రమే ఉన్నందున ఓటర్ నమోదు శాతం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

**చాగల్లు :** చాగల్లు తహశీల్దార్ కార్యాలయంలో, కలవలపల్లి, చిక్కాల, బ్రాహ్మణగూడెం, దారవరం గ్రామ సచివాలయాలు, గ్రామ పంచాయతీల్లో ఎంఎల్‌సి ఓటరు నమోదుపై ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి రెవెన్యూ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు

## ఫసల్ బీమాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.సుజాతకుమారి అన్నారు. మండలంలోని అన్నదేవరపేట, పోచవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఫసల్ బీమా ప్రయోజనాలను రైతులకు వివరించారు. వాతావరణ ఆధారిత పంటలు జీడి మామిడి పండించే రైతులంతా ఈ నెల 15లోగా ఈ పథకంలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. తూర్పుగోదావరి జిల్లాకు ఇస్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ కేటాయించారన్నారు. ఒక ఎకరాకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇకెవైసి, ఈ-పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు దీనికి అర్హులన్నారు. జిల్లాలో 7,619 మంది రైతులు జీడి మామిడి పండిస్తున్నారని వీరందరికీ మండలాలవారీగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారితో పాటు కొవ్వూరు ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, ఎఒ రుచిత, ఇస్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి పండు పలువు రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఖరీఫ్ పంట ధాన్యం కొనుగోలు కేంద్రాలపై, రైతు సేవాకేంద్రం గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై తహశీల్దార్ పి.చిన్నారారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ధాన్యం మద్దతు ధర ప్రతి రైతుకు తెలియజేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ధాన్యం మద్దతు ధరను ఫీల్డ్ లెవెల్‌లో ప్రతి ఆర్‌బికె, పిఎసిఎస్, సిబ్బంది కి రైతులకు అవగాహన కల్పించాలన్నారు . మండల వ్యవసాయ అధికారి కెవిఎన్.రమేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రతిరోజు రైతులవద్దకు వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న మద్దతు ధర, ధాన్యంలో ఉండవలసిన తేమశాతం, నాణ్యత ప్రమాణాలు రైతులకు వివరించాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన నిర్దేశించబడిన అంశాలను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, రైతు సేవా కేంద్రం సిబ్బందితో అనుసంధానం చేసుకొని రైతులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా గ్రామస్థాయిలో ధాన్యం కొనుగోలు జరిగేటట్లు చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రత్నకుమారి, మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ రమేష్ కుమార్, వివిధ గ్రామాల వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యదర్శులు, ఆదర్శ రైతులు వైట్ల రామకష్ణ, కొరపాటి జానకి రామయ్య, కొమ్మిశెట్టి సత్యనారాయణ, పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి ఓటు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి - ఐ.పోలవరం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎం ఎల్ సి ఎన్నిక ఓటు నమోదుకు అర్హులైన పట్ట భద్రులకు ఎంఎల్ సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ సోదరుడు బాబి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఐ.పోలవరం మండలం జి.వేమవరం గ్రామంలో ఉన్న ప్రత్యేక బస్త్రదం ఐ.పోలవరం, ముమ్మిడివరం, అల్లవరం, అయినవిల్లి, ఉప్పలగుప్తం మండలంలో ఉన్న పట్టభద్రులకు బాబి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చోడిశెట్టి బ్రహ్మానందం, కోళ్ల వీర భద్రరరావు, ముంగి కృష్ణ, యూనిట్ ఇన్ ఛార్జ్ పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు తదితరు పాల్గొన్నారు.

పట్టభద్రులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక బృందం

## రాష్ట్ర స్థాయి పోటీలకు చాగల్లు విద్యార్థులు

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్ర స్థాయి అండర్-19 వాలీబాల్ పోటీలకు చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.రోజా, ప్రవళిక, సత్య, సౌమ్య ఎంపికయ్యారని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. జిల్లా స్థాయ పోటీల్లో రాణించడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన పిఇటి ప్రేమ్‌చంద్‌ను, విద్యార్థులను హెచ్‌ఎం పి.వీర్రాజు, ఎస్‌ఎంసి ఛైర్మన్ కె.గోపాలకృష్ణ, ఆర్.వరప్రసాద్ అభినందించారు.

## పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది'

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని పిట్టల వేమవరం, కాపవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం ఎఒ మేరీ కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం కోతల సీజన్ ప్రారంభం కావడంతో ధాన్యం కొనుగోలుపై రైతుల సందేహాలు నివృత్తి చేశారు. దాళ్వాలో సాగు చేసే వరి రకాలపై రైతులకు అవగాహన కల్పించారు ఈకార్యక్రమంలో ఎఇఒ మసారమ్మా, విఎఎలు పాల్గొన్నారు.

## సిఎం మాటలను శిరసావహిస్తా : మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

నా మేలు కోరి సీఎం చంద్రబాబు హిత బోధ చేశారని, ఆయన మాటలను శిరసావహిస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆయన తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ తన పనితీరు మెరుగు పరుచుకుంటానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు చేరేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు సలహాలు ఇస్తుంటారన్నారు. ఆ క్రమంలో మంచి, చెడు చెప్తారని ఆ మాటలను వక్రీకరించి కొన్ని మీడియా,సోషల్ మీడియాలో సీఎం మాటలు, భావాన్ని వక్రీక రించాయనివివరించారు. రెండు రోజులు గా తనపై ట్రోల్ చేస్తున్న విషయమై మంత్రి సుభాష్ స్పందించారు. సీఎం చంద్రబాబు మంచి నాయకులను తయారు చేసే అనుభవ శాలి అని, ఆయన మాటలు ఎప్పుడూ శిరసావహించి, ముందుకు వెళతానన్నారు. పట్టభద్రుల ఓటర్ నమోదు చేసే విషయమై సీఎం చంద్రబాబు చ టెలి కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన మాటలను ఎవరో అసూయతో వాయిస్ రికార్డు చేసి బయటకు విడుదల చేయడం సరికాదని మంత్రి సుభాష్ ఈ సందర్భంగా హితవు పలికారు.

## వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో వేర్వేరు చోట్ల మంగళవారం అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో వాహనం, హోటల్, టైలరింగ్ దుకాణం దగ్ధమయ్యాయి. వివరాలు ఇవి..

కొత్తూరు సెంటర్ వద్ద వాహనంలో మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

**ఆలమూరు:** ఒఎన్‌జిసి వాహనం దగ్ధమైన ఘటనపై ఆలమూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తూరు సెంటర్ వద్ద ఉన్న ఒఎన్‌జిసి రిగ్గులో పనిచేసే సిబ్బందికి సంబంధించిన మహేంద్ర బొలెరో వాహనం ఆలమూరు నుండి కొత్తూరు సెంటర్ వైపుగా ప్రయాణిస్తుంది. ఈ వాహనంలో డ్రైవర్ తో పాటుగా విధులు నిర్వహిస్తున్న మరో ముగ్గురు సిబ్బంది ఉన్నారు. ఈ క్రమంలో ఆలమూరు యూనియన్ బ్యాంకు సమీపానికి వచ్చేసరికి వాహనం ఇంజన్ లో సాంకేతిక లోపంతో మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన సిబ్బంది వాహనం నిలుపుదల చేసి, దాని నుండి దిగి దూరంగా పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నారు. వాహనంతో పాటుగా ఒఎన్‌జిసి పనిముట్లతో పాటుగా ఖరీదైన లాప్ టాప్ లు, మొబైల్ ఫోన్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సిఐ సిహెచ్.విద్యాసాగర్ తో పాటు ఎస్ఐ ఎం.అశోక్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి ట్రాఫిక్ ను నియంత్రించారు. భారీ నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జె.హనుమంతరావు, ఎల్ఎఫ్ ఎం.వెంకటేశ్వర్లు, డిఒపి డి.సుబ్రహ్మణ్యం, ఫైర్ మ్యాన్ ఏ.వరప్రసాద్, పోలీస్ సిబ్బంది శ్రీనివాసరావు, రవి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పలగుప్తం:** కూనవరంలో మంగళవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో కాఫీ హోటల్, టైలరింగ్ షాపు పూర్తిగా దగ్ధమయ్యాయి. హోటల్‌లో గ్యాస్ స్టవ్ నుంచి లేచిన మంటల కారణంగా బూసి సత్యనారాయణ హోటల్‌తో పాటు పక్కనే ఉన్న కుంచే వెంకటరమణ కు చెందిన టైలరింగ్ షాపునకు మంటలు వ్యాపించి దగ్ధమ్మయ్యాయి. ఆస్తి నష్టం సుమారు రూ.ఐదు లక్షలు ఉంటుందని అంచనా. అమలాపురం అగ్నిమాపక కేంద్రం దళం వచ్చి మంటలను అదుపు చేశాయి. అగ్ని ప్రమాదం జరిగే సమయంలో హోటల్లో టీ తాగేందుకు వచ్చిన పలువురు భయభ్రాంతులకు గురై పరుగులు తీశారు. హోటల్లోని రెండు గ్యాస్ సిలిండర్లు అగ్ని ప్రమాదంలో భారీ శబ్దంతో పేలడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందారు.ఈ ప్రమాదంలో హోటల్ యజమాని కుమారుడు రాజేంద్రప్రసాద్ కు గాయాలు కావడంతో 108 లో అమలాపురంలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.ఘటన స్థలాన్ని సర్పంచ్ వాకపల్లి ఈశ్వరీ సత్యనారాయణ, ఎస్ఐ సిహెచ్.రాజేష్, విఆర్ఒ,కె. సూర్యకుమారి తదితరులు పరిశీలించారు.

కూనవరంలో దగ్ధమవుతున్న కాఫీ హోటల్, టైలరింగ్ షాప్


మహారాజశ్రీ విజయవాడ 14వ అధనపు జిల్లా జడ్జి మరియు ఫ్యామిలీ కోర్టులో

**FCOP No.1389 / 2019**

బిట్వీన్
మాచినేని శిల్పా ...పిటీషనర్
వర్సెస్
మాచినేని కృష్ణకాంత్ ...రెస్పాండెంట్

టు (రెస్పాండెంట్)
మాచినేని కృష్ణకాంత్, తండ్రి : M.V.నాగేశ్వరరావు, వయస్సు 42సంగలు,Sr. మెయింటెనెన్స్ ఇంజనీర్, బేకర్స్ & హాఫ్స్ సింగపూర్ PET ప్లాట్ నెం.28 & 34, APIIC,ఇండస్ట్రీయల్ పార్క్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా, సెల్ నెం.9966133353

పై నెంబరు FCOP లో మాచినేని శిల్పా పిటీషనర్ అయి ఉన్నారు. సదరు మాచినేని కృష్ణకాంత్ FCOP నందు రెస్పాండెంట్ గా యుండి యున్నారు. పిటీషనర్ అయిన మాచినేని శిల్పా సదరు మాచినేని కృష్ణకాంత్ పై విజయవాడ 14వ అదనపు జిల్లా జడ్జి మరియు ఫ్యామిలి కోర్టు నందు మెయింటెనెన్స్ కొరకు తన భర్త అయిన మాచినేని కృష్ణకాంత్ పై పిటీషన్ దాఖలు చేసి యున్నారు. గౌరవ కోర్టు వారు పిటీషనర్‌కి అనుకూలముగా తీర్పు ఇచ్చి యున్నారు. దానికి గాను పిటీషనర్ **Crl.M.P.No.83 / 2024** దాఖలు చేసి శ్రీ కోర్టు వారు రెస్పాండెంట్ అయిన మాచినేని కృష్ణకాంత్ గారికి నోటీసులు జారీ చేసి యున్నను. సదరు నోటీసులను ఉద్దేశ్యపూర్వకముగా వాటిని తీసుకొనకుండా వుండుట చేత పిటీషనర్ శ్రీ కోర్టు వారికి పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయుటకు పిటీషన్ దాఖలు చేసుకోగా శ్రీ కోర్టు వారు దానికి అంగీకరించి నందున రెస్పాండెంట్ అయిన మాచినేని కృష్ణకాంత్ గారికి శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ ప్రకటన ద్వారా నోటీసు ఈ FCOP దావాలో రెస్పాండెంట్ కు జారీ చేయడం అయినది. కావున మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేదీ. **20-12-2024**న ఉదయం గం.**10.30** నిIIలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై తెలుపు కోవలెను. లేని యెడల మీకు పరోక్షమున తీర్మానం చేయబడునని తెలియజేయడమైనవది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**వాయిదా తేదీ : 20-12-2024**

Bandla Sambasiva Rao
Advocate
D.No.27-20-33,
Museum Road
Vijayawada
CellNo.9848020180

విజయవాడ
29-10-2024


## నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- పంచాయతీరాజ్ డిఇ సూర్యనారాయణ

ప్రజాశక్తి - ఆలమూరు

అభివృద్ధి పనుల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ డివిజనల్ ఇంజనీర్ ఎవి.సూర్యానారాయణ గుత్తేదారులకు ఆదేశించారు. గత నెల 17న కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు భూమి పూజ చేసిన బడుగువానిలంక ప్రధాన రహదారికి సిసి రోడ్డు విస్తరణ పనులు మంగళవారం పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ డి.వీరభద్రరావుతో కలిసి ఆయన పరిశీలించారు. డిఇ మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల నిర్మాణాలను పరిశీలించామన్నారు. అలాగే గుత్తేదారులకు నిర్మాణాల్లో నిబంధనలు పాటించాల తెలిపారు. బివిలంకలో రూ.30 లక్షలు ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో రహదారికి ఇరువైపులా మొత్తం 8 అడుగులు వెడల్పుతో సిసి రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. గతంలో 10 అడుగుల రోడ్డు ఉండగా దీంతో కలిపి మొత్తం 18 అడుగులు రహదారిగా అభివృద్ధి చేస్తారన్నారు. అలాగే పినపల్ల, చెముడులంక, చొప్పెల్ల, తదితర గ్రామాల్లో అభివృద్ధి పను లు పరిశీలనలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కూట మి నాయకులు పాలూరి గోవింద రాజు, దూలం రాంబాబు, పడాల అమ్మిరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వంశీ, విస్సు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డిఈ సూర్యనారాయణ


**పడిపోయినవి**

తూIIగోIIజిల్లా, రాజమహేంద్రవరం పట్టణ గ్రామ కాపురస్తులు **శిరపరపు మోహన్‌రావు గారి భార్య అయిన జ్యోతికుమారి** అను నేను విన్నవించుకొను విన్నపములు.

నేను నా భర్త ఇరువురూ నా తల్లిదండ్రుల ఇంటి నుండి అనగా గోకవరం నుండి రాజమహేంద్రవరం వచ్చు దారిలో దివి. 22-10-2024 రాత్రి 7 గంII సమయంలో గోకవరం గ్రామ శివారులో నాకు గల అన్ రిజిష్టర్డ్ దాన శెటిల్‌మెంటు దస్తావేజు దివి. 7-5-2007 సంII తేదీ గల కాగితాలు పడిపోయినాయి. కావునా దానికి సంబంధించిన కాగితాలు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు సంప్రదించి కాగితాలు ఇప్పించకోరుతాము. ఎవరైనా పై కాగితాలు దొరికిన ఎడల మాకు అందచేసినచో తగిన పారితోషికం ఇవ్వబడును. ఎవరైనా అక్రమ లబ్ది పొందుటకు ఉపయోగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొందురు.

**శిరపరపు జ్యోతికుమారి**
డో.నెం. 36-28-39,
ఇన్నీసుపేట, రాజమహేంద్రవరం,
సెల్:8019220818



మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

**O.S. No. 241/2024**

*Between:*
Puvvala Vara Prasad ...*Plaintiff*
AND
Satyam Satish,and others ...Defendants

1. Satyam Satish, S/o. Nageswara Rao, Hindu, aged 33 years, D.No. 4-243/2, Society Street, Inugantivaripeta, Muggulla, Seethanagaram Mandal, E.G.Dt.,

...*1, Defendant*

పై నెంబరు దావాలో 1, ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. **11-11-2024 సంIIరం తేదీ ఉదయం 10.30 నిIIలకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**జి.ఎస్.ఎస్.మురళీమోహన్**
**జి.వి.రామలక్ష్మి**
అడ్వకేట్స్, రాజమండ్రి

రాజమండ్రి
01-11-24



మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

**O.S. No. 1180/2022**

*Between:*
1. Smt. Marthvampati Chamundeswari
2. Mr. Marthvampati Gopi Krishna.

...*Plaintiffs*

AND

M/s.Gayatri English Mediurn Public School,and others ...Defendants

1. M/s.Gayatri English Mediurn Public School, Rajahmundry. Represented by Correspondent, Mr.Doddi Ramaswamy Naidu, Door No. 2-40-151, Oup.Railaway Hospital, Behind Medplus, Main Road, Aicot Gardens, Rajamahendravarem,

...*1,Defendant*

పై నెంబరు దావాలో 1, ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. **11-11-2024 సంIIరం తేదీ ఉదయం 10.30 నిIIలకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**జి.ఎస్.ఎస్.మురళీమోహన్**
**జి.వి.రామలక్ష్మి**
అడ్వకేట్స్, రాజమండ్రి

రాజమండ్రి
01-11-24



**నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం**

ఆర్.ఓ.సి. నెం. 12285/2002-ఎ1 తేది.05-11-2024

**వేలం నోటీసు**

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధీనములోని వివిధ షాపింగ్ కాంప్లెక్సులలో ఖాళీగా ఉన్న షాపు రూములు (జాబితాలో 8వ కాలము నందు చూపబడిన రిజర్వుడు కేటగిరి షాపులు మినహాయించి) స్వాధీనం చేయబడిన తేదీ నుండి లేదా నగరపాలక సంస్థ నిర్ణయించిన తేదీ లగాయితూ 3 సంవత్సరముల కాలం నెలసరి అద్దె చెల్లించు ప్రాతిపదికపై అనుభవించు గుత్త హక్కును వేలమును నగరపాలక సంస్థ కార్యాలయము నందు ది. 20-11-2024 తేదీ నుండి ది. 25-11-2024 తేదీ వరకు నిర్వహించబడును.

వేలములో పాల్గొనుటకు ఆసక్తి గలవారు యిందుతో జతపర్చబడిన పట్టికలో చూపిన ప్రకారము ధరావత్తు సొమ్ము కమిషనరు, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం వారి పేరున డిమాండు డ్రాఫ్టు మరియు మూడు సంవత్సరముల కాలమునకు బ్యాంకు గ్యారంటీ తీసుకొని ఆఫీసులో ది. 19-11-2024వ తేదీ మధ్యాహ్నం గంII 1.00 లోపు దరఖాస్తు దాఖలు చేయవలెను. చెక్కులు స్వీకరించబడవు. ఒక్కొక్క షాపునకు విడివిడిగా ధరావత్తు, బ్యాంకు గ్యారంటీ, ఆధార్ జిరాక్సులతో దరఖాస్తు దాఖలు చేయవలెను. దరఖాస్తు దాఖలు పరచినవారిని మాత్రమే వేలమునకు అనుమతించబడును. వేలం కమిషనరు గారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని నిర్వహించబడును. వేలములో పాల్గొనువారు నగరపాలక సంస్థకు ఏ విధమైన బకాయిలు వుండరాదు.

వేలములో ఖాయపరచిన అద్దెతో 3 నెలల అద్దె (జి.ఎస్.టి. అదనము) అడ్వాన్సుగా 7 దినములలోగా చెల్లించిన తదుపరి షాపు అప్పగించబడును. వేలములో ఖాయపరచిన అద్దెపై 18% జి.ఎస్.టి. తో ప్రతి నెల 10వ తారీఖు లోగా కలిపి చెల్లించవలెను. మొదటిసారి లీజు కాలము 3 సంవత్సరములు, తదుపరి 3 సంవత్సరములకు స్థాయీ సంఘము వారి ఆమోదమునకు లోబడి 33 1/3 శాతం పెంపుదల (లేదా) 10% మార్కెట్ విలువ సంవత్సరము అద్దెగా లేదా పరిసరాల ప్రాంతాలలోని షాపుల అద్దె విలువ ఏది అధికమో దానిపై అద్దె హెచ్చింపు నిబంధనపై పొడిగించబడును. లీజుకాలము 25 సంవత్సరముల వరకు మాత్రమే పొడిగించబడును. తదుపరి షాపు నగరపాలక సంస్థకు అప్పగించవలెను. వేలం ఖాయపరచుటకు లేదా తిరస్కరించుటకు కమిషనరు గారికి పూర్తి అధికారం కలదు. మరియు నగరపాలక సంస్థ విధించు అన్ని ఇతర షరతులకు లోబడి వేలము నందు పాల్గొనవలెను. నగరపాలక సంస్థ కార్యాలయములో రెవెన్యూ విభాగము నందు ఎ16 గుమస్తా నుండి షాపులు, నెలవారీ అద్దె, చెల్లించవలసిన ధరావత్తు, దాఖలు చేయవలసిన బ్యాంకు గ్యారంటీ, వేలం నిర్వహించుచున్న తేదీ మొదలగు వివరములను పొందగలరని తెలియచేయడమైనది.

సం/- **కేతన్ గార్గ్,** కమిషనరు
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం